నరసాపురంలోని రహదారులకు మహర్దశ

వేగంగా నిర్మాణ పనులు

మొగల్తూరు: నియోజకవర్గంలోని ప్రధాన రహదారులకు మహర్దశ పట్టనుంది. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు గతంలో తీరప్రాంత గ్రామాల్లోని పుంత రోడ్లను జాతీయ విపత్తు నివారణ పథకంలోని నిధులతో అభివృద్ధి చేశారు. అంతే కాక నియోజకవర్గంలోని గ్రామాలపై పూర్తి అవగాహన ఉండటంతో అభివృద్ధి పనులు చేపట్టడంలో ముందున్నారు. ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ప్రసాదరాజు ప్రధాన రహదారులుపై దృష్టి సారించారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తున్నారు.

95 కిలోమీటర్ల మేర
రూ.75 కోట్లతో అభివృద్ధి

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సుమారు 95 కిలో మీటర్ల రహదారులను రూ.75 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని రహదారుల పనులు ప్రారంభం కాగా మరికొన్ని త్వరలో ప్రారంభం కానున్నాయి. లక్ష్మణేశ్వరం నుంచి పీఎం లంక రూ.20 కోట్లు, నరసాపురం టౌన్ నుంచి కరింశెట్టివారిమెరక వయా లక్ష్మణేశ్వరం, సారవ రూ.7 కోట్లు, బియ్యపుతిప్ప మోళ్ళపర్రు వయా వేములదీవి, పీఎంలంక రూ.4.30 కోట్లు, నరసాపురం పీతానివారి మెరక వయా లక్ష్మణేశ్వరం, వైఎస్‌పాలెం, రామన్నపాలెం రూ.2.70 కోట్లు, ముత్యాలపల్లి, మోళ్ళపర్రు వయా మోడి, పేరుపాలెం రూ.28 కోట్లు, కొత్తోట,కోమటితిప్ప, వయా వెంప, కాళీపట్నం, రూ.9 కోట్లు, మెట్రేవు, అల్లం వారి మెరక నుంచి పేరుపాలెం బీచ్ వరకు రూ.8 కోట్లతో రహదారులను అభివృద్ధి పరచనున్నారు. అంతేకాక కాళీపట్నం పడమర నుంచి జగన్నాథపురం వయా పాతపాడు వరకూ రహదారి నిర్మాణంతో పాటు రెండు వరుసల వంతెన నిర్మాణం కోసం మంజూరైన రూ.12 కోట్లతో ఇప్పటికే పనులు ప్రారంభించారు. అలాగే మొగల్తూరు గాంధీ బొమ్మల సెంటర్ నుంచి బేతపూడి వరకు వయా వెంప రహదారికి మంజూరైన రూ.12.64 కోట్లతో చేపట్టిన పనులు ప్రారంభమయాయి,


నిర్మాణంలో ఉన్న కాళీపట్నం- పాతపాడు రహదారి


త్వరలో పనులు ప్రారంభంకానున్న లక్ష్మణేశ్వరం పీఎంలంక రోడ్డు

మరిన్ని రహదారుల అభివృద్ధి



ఇప్పటికే కోట్లాది రూపాయలతో రహదారులు, వంతెనలు నిర్మించాం. ఇటీవల విడుదలైన రూ.75 కోట్లతో సుమారు 90 కిలోమీటర్ల మేర రహదారి పనులను చేపట్టబోతున్నాం. నియోజకవర్గంలోని మరికొన్ని రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

క్లుప్తంగా

వీఓఏల సమస్యలను పరిష్కరించాలి


మొగల్తూరులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న వెలుగు వీఓఏలు

మొగల్తూరు: వెలుగు వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ జి.అనితా కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వీఓఏల మూడు సంవత్సరాల కాలపరిమితిని రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.విజయ, వి.వెంకటలక్ష్మి, వై.పద్మ, కె.రాజేశ్వరి, అనిల్ కుమారి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడులో అదనపు తరగతి గదుల నిర్మాణం


దిగమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులకు శ్లాబు వేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నాడు - నేడు నిధులు రూ.కోటి రూపాయలతో ఆధునికీకరణ చేస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి అనుమతులు లేవు. దీంతో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ సూచనల మేరకు ఉన్నతాధికారుల అనుమతితో మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రత్యేక అనుమతులు లభించడంతో గురువారం శ్లాబులు నిర్మించారు. గ్రామ సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్, హెచ్‌ఎం షేక్ పీర్ సాహెబ్, ఎస్‌ఎంసీ చైర్మన్ చంద్రశేఖర్, సభ్యుడు రాపాక నందియ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులు పనులను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా మజ్జిగ పంపిణీ

పెనుగొండ: వేసవి తాపం తీవ్రంగా ఉండడంతో 30 రోజులుగా సిద్ధాంతంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఎంపీపీఎస్ హరి ప్రసాద్ మజ్జిగ పంపిణీ చేస్తూ బాటసారుల దాహార్తిని తీరుస్తున్నారు. నిత్యం 500 మందికి పైగా మజ్జిగ అందిస్తున్నారు. చలివేంద్రాన్ని సిద్ధాంతం నందీశ్వర దేవాలయంవద్ద చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. 30 రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్న హరిప్రసాద్‌ను పలువురు అభినందించారు.

వైభవంగా వరసిద్ధి వినాయక విగ్రహ పునఃప్రతిష్ఠ


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పెనుగొండ: ఆచంట శివారు కొత్తూరులో దాతల సహకారంతో నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం విగ్రహ పునః ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు, హోమంల నిర్వహించారు. అనంతరం సూరిశెట్టి ఏకాంబరీశ్వరం దంపతులు వేద పండితులు మానేపల్లి సాంబశివరావుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉండాలి

వీరవాసరం: సమస్యకు పరిష్కారం లభించే వరకు పర్యవేక్షణ అవసరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం వీరవాసరం తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై, జగనన్న కాలనీలో ఇండ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు, రెండవ దశ రీసర్వే పనులు, సంబంధిత అధికారులతో శాఖలు వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ ఎట్టి పరిస్థితుల్లో స్పందన కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులు పరిష్కారమయ్యేటట్లు చూడాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పూర్తి పరిష్కారాన్ని చూపాలన్నారు. పరిష్కారం పంపిన అనంతరం ఫిర్యాదు దారుడుతో మాట్లాడి అభిప్రాయాన్ని స్వయంగా తెలుసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఫిర్యాదు తిరిగి ఓపెన్ అవ్వడానికి వీల్లేదన్నారు. ఫిర్యాదును ప్రతి ఒక్క అధికారి క్షుణ్ణంగా చదివిన తర్వాతే పరిష్కారాన్ని అందజేయాలన్నారు. మన దగ్గరే సమస్య పరిష్కారమైతే అర్జీదారుడు ఎట్టి పరిస్థితుల్లో తదుపరి చర్యలకు వెళ్లరని ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దాసి రాజు, గృహ నిర్మాణ శాఖ ఈఏ బి.వెంకట రమణ, తహసీల్దారు ఎం.సుందర రాజు, ఎంపీడీఓ ఎస్.ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు

నరసాపురం: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి ఉచిత విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారంతో ఈ తరగతులు 25వ రోజుకు చేరాయి. గురువారం శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు యోగా, చెస్, కంప్యూటర్ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ కేజేఎస్‌ఎల్ కుమారి ఆధ్వర్యంలో నీతికథలు, పద్యాలు చెప్పారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

పోడూరులో ఉద్రిక్తత

పోడూరు: భీమవరంలో ఫ్లెక్సీల వివాదం ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావును గురువారం ఉదయం పోలీసులు అరెస్టు చేసి పోడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలిసి జనసేన కార్యకర్తలు పోడూరు పోలీస్‌స్టేషన్ దగ్గరకు చేరుకుని గుమిగూడటంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరకు గోవిందరావును పోలీసులు విడిచిపెట్టడంతో ఆయన అక్కడి నుంచి వెళ్లి పోయారు. నరసాపురం డీఎస్పీ కె.మనోహరాచారి స్టేషన్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పాలకొల్లు రూరల్ సీఐ కె.శ్రీనివాసకుమార్, స్థానిక ఎస్ఐ డి.రామ్‌కుమార్ డీఎస్పీ వెంట ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం


వడలి నాయకులు, దాతలను అభినందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


దొంగరావిపాలెం మహిళలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: వడలిలో ఎస్సీ కాలనీ వద్ద జగనన్న కాలనీ రహదారికి సహకరించిన దాతల దాతృత్వం అభినందనీయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అభినందించారు. గురువారం తూర్పుపాలెంలో జరిగిన కార్యక్రమంలో నాయకులను, దాతలను అభినందించారు. అదేవిధంగా రహదారి పూడికకు స్వంత ఖర్చులతో సహకరించడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. 20 అడుగుల వెడల్పున, 280 అడుగుల పొడవున స్థలాన్ని దాతలు సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, చిన్నం వారిపాలేనికి చెందిన నల్లిమిల్లి విజయ భాస్కర్ రెడ్డిలు ముందకు రావడంతో కాలనీ వాసులకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలు నెరవేర్చడంలో దాతలు సైతం ముందుకు వస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. దీనికి ప్రజల మద్దతు మెండుగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసానీ విజయలక్ష్మీ పెద్దిరాజు, ఎంపీటీసీలు చిటికెన దుర్గాభవానీ నాగేంద్ర ప్రసాద్, రెడ్డి గణేశ్వరరావు, బీసీ సెల్ కాసాని శ్రీనివాసరావు, తమరాని సత్యనారాయణ, వెలగల మందయ్య, బొల్లా భాస్కరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు

దొంగరావిపాలెంలో అర్హులందరికీ ఇంటి స్థలాలు అందించడం జరుగుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం తూర్పుపాలెంలో దొంగరావిపాలేనికి చెందిన మహిళలతో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా ఎన్నో ఏళ్లుగా రహదారి సమస్యతో ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులకు అండగా నిలుస్తామన్నారు. దీంతో పాటు దొంగరావిపాలెం అభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), పోడూరు జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, పార్టీ నాయకులు పోడూరి రామయ్య, పెచ్చెట్టి జేమ్స్, గుబ్బల వీరబ్రహ్మం, మేడిచర్ల పండు, కోట వెంకటేశ్వరరావు, తిక్కిరెడ్డి పవన్ తదితరులు పాల్గొన్నారు.

81.69 శాతం పింఛన్ల పంపిణీ

మొగల్తూరు: మండలంలోని 17 గ్రామాలు, 21 సచివాలయాలకు సంబంధించి గురువారం 81.69 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద కుమార్ తెలిపారు. మండలంలోని 10,459 పింఛన్లకు గాను గురువారం వేకువ జాము నుంచి పంపిణీ ప్రారంభించగా సాయంత్రానికి 8544 మందికి పింఛన్లు అందించారు. మిగిలిన పింఛన్లు ఊడా మరో రెండు రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

అమరావతికి ముదునూరి

నరసాపురం: ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు శుక్రవారం నియోజకవర్గంలో అందుబాటులో ఉండరు. ఆయన అమరావతి వెళ్లారు. తిరిగి శనివారం నియోజకవర్గానికి చేరుకుంటారని ముదునూరి కార్యాలయ వర్గాలు విలేకరులకు తెలిపాయి.

జనసేన కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని వినతి


పాలకొల్లు పట్టణ సీఐ రాంబాబుకి ఫిర్యాదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని యడ్లబజారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన పెత్తందారులకు, పేదలకు మధ్య యుద్ధం నినాదంతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని జనసేన కార్యకర్త చించివేయడంపై పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం జనసేన కార్యకర్తపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణ సీఐ రాంబాబుకి ఫిర్యాదు అందజేశారు. జనసేన కార్యకర్త ఫ్లెక్సీ చించివేస్తున్న దృశ్యాలు సీసీ పుటేజ్‌లో రికార్డు అయ్యిందని, ఆ రికార్డులు పరిశీలించి సదరు కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల చర్యలు స్నేహపూరిత వాతావరణంలో ఒకరికొకరు గౌరవం పెంచుకునేలా ఉండాలని, ఇలా రెచ్చగొట్టే విధంగా కవ్వింపు చర్యలకు పాల్పడకూడదని యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవల్లి వాసు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐకి ఫిర్యాదు అందజేసిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు మోర్త గిరీష్, బండి రమేష్, లోపింటి చిరంజీవి, నీలంశెట్టి సత్యప్రసాద్, పీటర్‌సన్ చిన్ని, పెచ్చెట్టి ఏడుకొండలు, బాకూరి సత్య నిరంజన్‌కుమార్, ఉప్పె పండు, నక్కా చిత్తరంజన్‌దాస్, జమ్ము కాశీవిశ్వనాథ్, కెల్లా దుర్గారావు, పెచ్చెట్టి హేమంత్‌కుమార్, ఈద మధు తదితరులు ఉన్నారు.

జగనన్న కాలనీలో జోరుగా అభివృద్ధి పనులు

పోడూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయని గుమ్మలూరు సర్పంచ్ గొట్టుముక్కల సోనియారమేష్ అన్నారు. గుమ్మలూరు జగనన్న కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, విద్యుత్‌లైన్‌ను గురువారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కాలనీలో ప్రభుత్వ నిధులు రూ.8లక్షల వ్యయంతో నిర్మించిన మెటల్‌రోడ్డును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు కొండేటి వెంకటేశ్వరరావు, జుత్తుగ సత్యనారాయణ, కుక్కల నాగేశ్వరరావు, నేలపూడి సురేష్, బొక్కా వెంకటకృష్ణ, పైడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి పింఛన్ అందజేత


గుమ్మలూరులో కిడ్నీ బాధితుడికి రూ.10వేల పింఛన్ సొమ్ము అందిస్తున్న సర్పంచ్ సోనియా

పోడూరు: గుమ్మలూరు గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడు మండెల సూర్యనారాయణకు గురువారం సర్పంచ్ గొట్టుముక్కల సోనియారమేష్ ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 వేలు కిడ్నీబాధిత పింఛను అందజేశారు. సూర్యనారాయణ కొంతకాలంగా 2 కిడ్నీలు పాడై అనారోగ్యం పాలయ్యాడు. సర్పంచ్ సోనియా రమేష్ అతని పరిస్థితిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సూర్యనారాయణకు కిడ్నీ బాధిత పింఛను మంజూరయ్యేలా కృషి చేశారు. దీంతో ప్రభుత్వం నుంచి సూర్యనారాయణకు రూ.10 వేల పింఛను మంజూరైంది. ఈ సందర్భంగా కిడ్నీ బాధితుడు సూర్యనారాయణ మాట్లాడుతూ రెండు కిడ్నీలు పాడవడంతో తీవ్ర అనారోగ్యం పాలయ్యాననీ, గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యకం చేశాడు. ఈ పరిస్థితుల్లో తనకు ప్రభుత్వం రూ.10 వేల పింఛను మంజూరు చేయడంతో సూర్యనారాయణ సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే శ్రీరంగనాథ రాజుకు, గ్రామసర్పంచ్ సోనియా రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌కు అనూహ్య స్పందన

నరసాపురం రూరల్: పేదల వైద్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది. ప్రతీ పేద రోగికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే చాలా మేరకు ఆసుపత్రులను, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను, హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. వీటికితోడు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీరోజూ వైద్యులు ఆయా గ్రామాల్లోని హెల్త్ క్లినిక్‌లకు, రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. అవసరమైన మందులు ఇవ్వడం, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోగికి తగు సూచనలు, సలహాలను ఇస్తూ సీఎం జగన్ ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్యసిబ్బంది ధైర్యం చెబుతున్నారు. తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజుగారితోట గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఎ.చిరంజీవి రోగులను పరీక్షించి అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 182 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ మంగతాయారు, హెల్త్ అసిస్టెంట్ చింతపల్లి రవి, సీహెచ్‌ఓ వైదుర్య పాల్గొన్నారు.


రాజుగారితోట గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థుల భవిష్యత్తే ఛాంబర్ కళాశాల లక్ష్యం


ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఛాంబర్ కళాశాల చైర్మన్, టాలెంట్ షైన్ సీఈఓలు

పాలకొల్లు సెంట్రల్: విద్య పూర్తవుతున్న విద్యార్థులకు ప్రాంగణ ఎంపికల ద్వారా మంచి ఉన్నతమైన భవిష్యత్ కల్పించాలనేది తమ లక్ష్యమని టాలెంట్ షైన్ సంస్థ సీఈఓ వేణుగోపాల్ అన్నారు. గురువారం స్థానిక బిఆర్‌ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలతో టాలెంట్ షైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మధ్య అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా టాలెంట్ షైన్ సంస్థ సీఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు విద్యతో పాటు మంచి ఉన్నత ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవడానికి ఎకడమిక్ సిలబస్‌తో పాటుగా ప్రాంగణ ఎంపికలు నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా ఉద్యోగాలు పొందడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవగాహనా ఒప్పందం వల్ల ఛాంబర్స్ డిగ్రీ, పీజీ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలలో నైపుణ్యాలైన కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్, హెచ్‌ఆర్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌లో టాలెంట్ షైన్ ఇండియా శిక్షణ ఇస్తుందన్నారు. కళాశాల చైర్మన్ నరసింహరావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించి విద్యార్థులకు మంచి కార్పొరేట్, సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఇతర ప్రైవేటు రంగాల్లో స్థిరపడే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడిషినల్ చైర్మన్ తటవర్తి కృష్ణమూర్తి, అకాడమిక్ అడ్వైజర్ నందుల సీతారామారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, ఏబీఎస్ మూర్తి, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం


విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్న విద్యా చైతన్య సమాఖ్య సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పేద విద్యార్థికి విద్యా చైతన్య సమాఖ్య సభ్యులు గురువారం ఆర్థిక సహాయం అందించా. ఈ సందర్భంగా సమాఖ్య సెక్రటరీ పోలిశెట్టి శ్రీశ్రీ మాట్లాడుతూ యలమంచిలి మండలం మట్లపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి చెల్లుబోయిన లీలా సత్యశ్రీనాథ్ ఇటీవల పదో తరగతి పరీక్షా పలితాల్లో 500 మార్కులు సాధించాడు. అలాగే జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌కు సైతం ఎంపికయ్యాడు. శ్రీనాథ్‌కు తండ్రి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో విద్యను కొనసాగించలేని పరిస్థితిలో ఉన్నాడు. విద్యార్థి శ్రీనాథ్ సమస్యను కొందరు ఉపాధ్యాయులు చైతన్య సమాఖ్య దృష్టికి తీసుకురాగా రూ. 60 వేలు ఫీజులు చెల్లించడానికి ముందుకు వచ్చారు. ఐఐటీ సాధించాలనే విద్యార్థి లక్ష్యం ఆర్థిక ఇబ్బందులు వల్ల ఆగిపోకూడదనే ఉద్దేశంతో తమ సంస్థతో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు ఆ విద్యార్థికి చేయూతనందించార న్నారు. ఇంటర్‌లో ఐఐటీ మెయిన్స్‌కు సంబంధించి రూ. 60 వేలు ఫీజు అవుతుండడంతో ఉపాధ్యాయులు కుక్కల గీతా కల్యాణి జిల్లా పరిషత్ హైస్కూల్, దొడ్డిపట్ల, మేడిశెట్టి వెంకట గణేష్ జిల్లా పరిషత్ హైస్కూల్, మట్లపాలెం ఇద్దరు ఉపాధ్యాయులు చెరో రూ. 20 వేలు మొత్తం రూ. 40 వేలు ఆర్థిక సహాయం అందించగా మిగిలిన రూ. 20 వేలు విద్యా చైతన్య సమాఖ్య సభ్యులు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మొదటి విడత ఫీజును గురువారం చెల్లించినట్లు శ్రీశ్రీ తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య ట్రెజరర్ జవ్వాది నాగేశ్వరరావు, సభ్యులు తోలేటి గాంధి, మంచెం ఉమామహేశ్వరరావు, వర్ధనపు సందీప్, పడవల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అదనపు టీఏ నియామకం

పాలకొల్లు అర్బన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పర్యవేక్షించేందుకు కర్నూలు జిల్లాకి చెందిన దాసరి రాముని అదనపు టెక్నికల్ అసిస్టెంట్‌గా నియమించారని ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు తెలిపారు. ఇప్పటివరకు జయబాబు టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. వీరు ఇరువురు ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తారన్నారు.

కార్మికుల సంక్షేమ మండలిలో సభ్యులుగా చేరాలి

సాక్షి, భీమవరం: భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు కార్మికుల సంక్షేమ మండలి సభ్యులుగా నమోదు చేసుకోవాలని భీమవరం 2వ సర్కిల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశి శివ నాగమల్లేశ్వరరావు చెప్పారు. గురువారం స్థానిక తాలూకా తాపీ పనివారల సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల కార్మికులను పనిలోకి అనుమతిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సహజ, ప్రమాద మరణానికి వైఎస్సార్ బీమా ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఏలూరు పంపుతామన్నారు. ఈశ్రమ్ కార్డులను శ్రామికులంతా కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు వంక వీరాస్వామి, మెల్ల సత్యనారాయణ, చిన్నంశెట్టి నాగేశ్వరావు, మేడిద వెంకటరమణ, బత్తిన నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో రూ.4.80 కోట్ల రైతు భరోసా నిధుల విడుదల

యలమంచిలి: మండలంలోని 15 రెవెన్యూ గ్రామాలకు చెందిన 6142 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.4.81 కోట్లు విడుదలయ్యాయని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి చెప్పారు. గ్రామాల వారీగా రైతుల వివరాలిలా ఉన్నాయి. ఊటాడ 45 మంది రైతులకు, ఇలపకుర్రు 785, ఏనుగువానిలంక 598, కలగంపూడి 100, కాజ 518, కొంతేరు 509, గుంపర్రు 798, చించినాడ 371, దొడ్డిపట్ల 538, నేరేడుమిల్లి 131, పెనుమర్రు 270, బూరుగుపల్లి 178, మేడపాడు 413, యలమంచిలి 871, శిరగాలపల్లి 287 వెరసి మొత్తం 6142 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.7500 చొప్పున రూ.4,80,90,000 విడుదల అయ్యాయని ఆమె వివరించారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమైందని వివరించారు.